క్లుప్తంగా

గుండెపోటుపై రోగులకు అవగాహన



రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గుండెపోటుపై రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ నాగ మహేశ్వరి మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు గుండెపోటుతో ప్రాణాలు పోగొట్టుకోరాదనే ఉద్దేశంతో హృదయరక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఛాతిలో నొప్పి రావటం, ఎడమ చేయి, భుజం లాగటం, ఆయాసం పెరగటం వంటి లక్షణాలు గుండెపోటుకు సంకేతాలన్నారు. ఆయా లక్షణాలు కనిపిస్తే వెంటనే రోగిని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు రావాలని ఆమె సూచించారు. డాక్టర్ మెర్సీ ప్రియాంక, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ లావణ్య, ఫార్మసిస్ట్ పిచ్చిరెడ్డి, హెడ్ నర్స్ ఎలిజిబెత్ పాల్గొన్నారు.

53 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవితేజకుమార్

కురిచేడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 53 మంది గర్భిణులకు వైద్యాధికారులు పి. ప్రవీణ్, వి.రవితేజకుమార్‌లు మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జి.కృపమ్మ, పీహెచ్‌ఎన్ లూర్దుశౌరి, హెల్త్ విజిటర్ లక్ష్మి, ఆప్తాల్మిక్ అధికారి బీజేఎస్ హెరాల్డ్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం



అలంకరణలో తిరుపతమ్మ, గోపయ్య

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో వెలసిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కళ్యాణంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది పాడి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం చల్లగా ఉండాలని మొక్కుకున్నారు. వచ్చిన భక్తులకు గ్రామస్తులు అన్నదానం చేశారు.



పుల్లలచెరువు కల్లాల్లో ఆరబోసిన మిర్చి



గుంటూరు మిర్చి యార్డులో ధర్నా చేస్తున్న రైతులు

మిర్చి రైతులకు నష్టాల ఘాటు

- రోజురోజుకూ ధరలు పతనం
- కన్నీరు పెడుతున్న రైతన్నలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ హయాంలో రికార్డు ధరలు

పుల్లలచెరువు: మిర్చిని సాగు చేయడమే సాహసం. భారీ పెట్టుబడితో కూడుకున్న ఈ పంటను మార్కెట్‌లో ధర ఉంటేనే గట్టెక్కడం గగనం. అలాంటిది ఈ ఏడాది దిగుబడులు తగ్గి ధరలు లేక రైతులు సతమతమవుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించకుండా వారి నెత్తిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం నష్టాల మూట మోపింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మిర్చి రైతులు సంతోషంగా ఉన్నారు. ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ధరలు కలిృంచి ఎర్రబంగారం సాగును లాభాల బాటలో నడిపించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను పీకల్లోతు నష్టాల్లో నెట్టి మిర్చి సాగంటేనే జంకే పరిస్థితి తీసుకొచ్చింది.

దిగుబడుల్లోనూ దిగాలే

మిర్చి దిగుబడుల్లోనూ వ్యత్యాసం లేకపోలేదు. మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది దిగుబడులు దారుణంగా పడిపోయాయి. గతంలో కంటే ఈ ఏడాది ఎకరాకు 10 క్వింటాళ్లు మించని పరిస్థితి. మరికొంత మందికి 5 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. అందుకు కారణం తామర పురుగు, జెమినీ వైరస్‌తో పాటు వాతావరణంలో మార్పు ప్రధాన కారణం. దీంతో పాటు నల్లి తీవ్రత ఎక్కువైంది. జిల్లాలో వేల ఎకరాల్లో నల్లి ప్రభావంతో దిగుబడులు పడిపోయినట్లు అధికారుల అంచనా.

మిర్చి పంట సాగు వివరాలు

మండలం	ఎకరాలు
పెద్దారవీడు	4,543
వై.పాలెం	10,405
పుల్లలచెరువు	8,099
త్రిపురాంతకం	5,768
దోర్నాల	5,818



గోతాల్లో తొక్కుతున్న మిర్చి

పెరిగిన పెట్టుబడులు

ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న మిర్చి పంటకు పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. కూలీలు, సేద్యాలు, ఎరువులు, పిచికారీ మందులు తదితర ఖర్చులు పంట ముగిసే వరకు ఎకరానికి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు. విపరీతంగా తెగుళ్లు, నల్లి ప్రభావంతో రైతులు ఆశను చంపుకోలేక పెట్టుబడులు భారీగా పెడుతున్నారు. దానికి తోడు మందులు, ఎరువులు ధరలు ఆకాశాన్నంటాయి.

దక్కని గిట్టుబాటు ధర

మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు వైరస్ మూలంగా రైతులకు సరైన దిగుబడులు లేకపోయాయి. కనీసం పండిన అరకొర పంటను అమ్ముకునేందుకు గిట్టుబాటు ధర లేదు. ఎకరానికి రూ.లక్షల్లో పెట్టుబడులు పెడితే తీరా అమ్మకాలు చేస్తే వచ్చేది రూ.50 నుంచి రూ.60 వేలు మాత్రమే. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎరువుల ధర బస్తాపై రూ.200 నుంచి 300 వరకు పెరగడం, మందుల ధరలు పెరగడంతో పెట్టుబడి భారం మరింతగా పెరిగిపోయింది. ఈ కష్ట కాలంలో తమకు అండగా నిలబడాల్సిన కూటమి ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని రైతులు వాపోతున్నారు.

పరిస్థితి దారుణంగా ఉంది

గతేడాది కూడా మిర్చి పంట సాగు చేశా. అప్పుడు పెట్టుబడి వెళ్లడంతో పాటు కొంత మిగిలింది. ఈ ఏడాది పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పరిస్థితి దారుణంగా ఉంది. పెట్టుబడులు పెరిగాయి. దానికి ఖర్చు పెరగడంతో పాటు ధరలు కూడా లేకపోవడంతో నష్టాలు వచ్చే పరిస్థితి ఉంది. ప్రభుత్వం పట్టించుకుని గిట్టుబటు ధరలు కల్పించకుంటే రైతులు దారణంగా దెబ్బతింటారు.

– గంగవరపు భాస్కర్‌రెడ్డి, ఉమ్మడివరం

గిట్టుబాటు ధర కల్పించాలి:



గతేడాదితో పోలిస్తే మిర్చి పంటకు గిట్టుబాటు ధరలు లేవు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కూటమి ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ చూపుతోంది. గతేడాది మిర్చికి ధరలు భారీగా ఉంటే నేడు ఆ ధరలు లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైతుల ఇబ్బందులు గమనించి మిర్చి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.

– డి.వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివిటీ సెక్రటరీ, పుల్లలచెరువు

రైతు ఆత్మహత్యలకు కూటమి ప్రభుత్వందే బాధ్యత:



రాష్ట్రంలో మిర్చి పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం గుంటూరు మిర్చి యార్డులో రైతులు రహదారిపై ధర్నా చేశారంటే ధరలు ఏలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రాక ముందే ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తే కొంత మేరకు మేలు జరుగుతుంది. లేకుంటే రైతుల ఆత్మహత్యలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి.

– జి.గురునాథం, సీపీఐ మండల కార్యదర్శి, పుల్లలచెరువు

నాడు-నేడు మిరప ధరల్లో వ్యత్యాసం

మిర్చిలో రకాలు	వైఎస్సార్ సీపీ హయాం 2023–24 రూ.(వేలల్లో)	కూటమి పాలన 2024–25 రూ.(వేలల్లో)
తేజ రకాలు	20–21	10–13
డీలక్స్ రకాలు	18–20	10–12
273 రకాలు	16–18	10–11
341 రకం	15–18	10–13

వైఎస్సార్ సీపీ నేతలకు ఘన సత్కారం



సన్మానం అందుకుంటున్న సింగా ప్రసాద్, దొండేటి నాగేశ్వరరెడ్డి

పెద్దదోర్నాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆ పార్టీ జిల్లా సెక్రటరీ అండ్ యాక్టివిస్ట్‌గా నియమితులైన సింగా ప్రసాద్, ఐటీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన దొండేటి నాగేశ్వరరెడ్డిలను మంగళవారం స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలోని శివసదనం అతిథి గృహంలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో నాయకులు లాలూనాయక్, యక్కంటి మల్లారెడ్డి, అల్లురాంభూపాల్‌రెడ్డి, యక్కంటి లింగారెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, చంద్రకాంత్ నాయక్, చిట్టె వెంకటేశ్వరరెడ్డి, సింగా నాగేశ్వరరావు, చాట్ల గంగయ్య తదితరులు పాల్గొని సత్కరించారు. సన్మాన గ్రహీతలు సింగా ప్రసాద్, దొండేటి నాగేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ తమకు అరుదైన గౌరవం కల్పించిన యర్రగొండపాలెం శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సురక్ష బీమాతో ఆర్థిక భరోసా



మల్లేశ్వరికి చెక్ అందజేస్తున్న బ్యాంక్ ఆర్ఎం రఘురామ్

పెద్దారవీడు: ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా ఉండి వ్యక్తి మరణిస్తే అతడి కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎం. రఘురామ్ అన్నారు. మండలంలో ఓబులక్కపల్లి గ్రామానికి చెందిన దుగ్గెంపుడి వెంకటరెడ్డి గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హనుమాన్‌జంక్షన్ కుంట ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అధికారులు వెంకటరెడ్డి భార్య మల్లేశ్వరికి బీమా పథకం ద్వారా పొందిన చెక్కును మంగళవారం పంపిణీ చేశారు. రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ దుగ్గెంపుడి వెంకటరెడ్డి బ్యాంక్‌లో ప్రధాన మంత్రి జీవన జ్యోతి పథకం ద్వారా రూ.436 ప్రీమియం చెల్లించగా రూ.2 లక్షలు, అదే విధంగా ఈ–క్రాప్ బీమా కింద రూ.1995 ప్రీమియం చెల్లించగా రూ.లక్ష, పైసా బీమా పథకం కింద 5 రూపాయలు చెల్లించగా రూ.50 వేల ఇన్సూరెన్స్ వర్తించిందని చెప్పారు. మూడు పథకాల ద్వారా మొత్తం రూ 3.50 లక్షలు చెక్కును మల్లేశ్వరికి అందజేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల బీమా పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంక్ మేనేజర్ పి.కార్తీక్, ఫీల్డ్ ఆఫీసర్ ధనకిశోర్, క్యాషియర్ సాయి తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల డుమ్మా

- ఎంపీటీసీ సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ ఆంజనేయరెడ్డి

త్రిపురాంతకం: తాగు నీటి సమస్య పరిష్కరించే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమావేశానికి రాకపోవడంతో పలువురు ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు డుమ్మా కొట్టారు. వేసవి కాలం సమీపించక ముందే గ్రామాల్లో నీటి సమస్య ఉత్పన్నమవుతోందని, అందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని జవాబు చెప్పేందుకు ముఖం చాటేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కంకణాలపల్లి నుంచి చెరువుకట్ట మీదుగా మిరియంపల్లి వెళ్లే దారి అస్తవ్యస్తంగా ఉందని, ఆ రోడ్డును అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయరెడ్డి అన్నారు. త్రిపురాంతకంలో ఉన్న బాలికల వసతి గృహం అరకొర వసతులతో కూడిన అద్దె భవనంలో ఏర్పాటు చేశారని, వెంటనే అధికారులు స్పందించి శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాలని, ఎన్ఆర్ఈజీఎస్‌లో ఎస్టిమేషన్‌లు వేసి మేజర్ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు. సమావేశానికి ఎంపీపీ రిబకమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈవోలు మల్లికార్జున నాయక్, రాజశేఖరరెడ్డి, డీటీ పుల్లారెడ్డి, ఏపీవో సుజాత, హౌసింగ్ ఏఈ శ్రీను పాల్గొన్నారు.

గ్రానైట్ లారీలు సీజ్



లారీలకు జరిమానా విధిస్తున్న ఎంవీఐ రవికుమార్

దర్శి: టిక్కలి నుంచి హిందూపురం గ్రానైట్ లోడుతో వెళ్తున్న రెండు లారీలను దర్శి ఎంవీఐ రవికుమార్ మంగళవారం సీజ్ చేశారు. రెండు లారీలు ఓవర్ లోడుతో వెళ్తున్నట్లు గుర్తించారు. వాటికి జరిమానా రూ.1.44 లక్షలు విధించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించిన తర్వాత వాటిని విడుదల చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

చందలూరు పాఠశాల సందర్శన



బీనా మోదీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జీపీఐ సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ బీనామోడీ మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో కొంత సమయం సంభాషించి పాఠశాలకు అవసరమైన వసతులను వారి కంపెనీ ద్వారా సమకూరుస్తామని చెప్పారు. జీపీఐ కంపెనీ ప్రతినిధులు జితేందర్, డాక్టర్ హరిబాబు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పి. వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



కురిచేడు: పప్పుశనగ నూర్పిడిని పరిశీలిస్తున్న ఏఓ మధుబాబు



పెద్దదోర్నాల: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

కురిచేడు: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసిందని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు కోరారు. పొలం ఉన్న ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు పొందేందుకు 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరన్నారు. రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఆధార్ కార్డులా ఇవ్వడం వ్యవసాయ సేవలు సులభతరం చేసి పారదర్శకంగా తీసుకొచ్చేందుకు ఉపయోగ పడుతుందన్నారు. విశిష్ట సంఖ్య నమోదు చేసుకున్న రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం వంటి పథకాలతో లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. గ్రామ సచివాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్,



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి ఈ సంఖ్యను పొందొచ్చన్నారు. ఆధార్ కార్డు, ఫోన్, పట్టాదారుపాస్ పుస్తకం తీసుకుని రైతు సేవా సిబ్బందిని కలిస్తే విశిష్ట సంఖ్యను పొందొచ్చన్నారు.

పెద్దదోర్నాల: వెబ్ ల్యాండ్ ద్వారా భూమి ఉన్న ప్రతి ఒక్క రైతు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతు గుర్తింపు కార్డు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన చిన్నదోర్నాల, జమ్మిదోర్నాలలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించి మిర్చి, టమాటా పంటలను పరిశీలించారు. రైతు గుర్తింపు కార్డు నమోదుకు పట్టాదారు పాసు పుస్తకం నకలు, ఆధార్‌కార్డు, 1బి, మొబైల్ నంబర్ తీసుకొని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈఓ చైతన్య కుమార్, రాజేంద్ర ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు: అటవీ భూముల అభివృద్ధికి తోడ్పడనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం తూర్పు గంగవరం, నాగంబట్లపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏకలవ్య నగర్లోని ఆర్వోఎఫ్ఆర్ అటవీ భూములు కలిగిన రైతులతో మాట్లాడారు. భూములకు నీటి సదుపాయం లేనందున నిరుపయోగంగా ఉన్నాయని చెప్పారు. ప్రకృతి సాగును కొంత విస్తీర్ణంలో చేపట్టాలని సూచించారు. ఏవో ప్రసాద్‌రావు, ప్రకృతి సాగు ఇన్‌చార్జి నరసింహులు, వీఏఏ సుమా, ఐసీఆర్పీ కోటి, రమేష్, వాణి, కోటిరత్నం, అనంతలక్ష్మి, కాటంరాజు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ విజయ జ్యోతికుమారి

తాళ్లూరు: రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని డిప్యూటీ కలెక్టర్ విజయ జ్యోతికుమారి ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను ఆమె పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలను వెను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఇమ్మానుయేల్ రాజ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.